పేరుకే క్రీడా ప్రాంగణాలు



ఉండవెల్లిలో పాఠశాలలోనే క్రీడలు ఆడుతున్న యువకులు (ఫైల్)

- రూ.లక్షల్లో ప్రభుత్వం ధనం వృథా
- నిర్వహణ లేక అధ్వానంగా మైదానాలు
- చాలా చోట్ల బోర్డులు తొలగించిన వైనం

ఉండవెల్లి: గ్రామాల్లోని యువత, విద్యార్థులకు ఆరోగ్యకరమైన జీవితం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. లక్ష్యం బాగానే ఉన్నా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో వాటి నిర్వహణ ఆయా గ్రామాల్లో అధ్వానంగా మారింది. గ్రామీణ ప్రాంతాల యువతను క్రీడల్లో ప్రోత్సహించాలన్న లక్ష్యంతో మైదానాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం లక్ష్యానికి గండి పడుతోంది. క్రీడా ప్రాంగణాల నిర్మాణం సమయంలో ఆర్భాటం చేయడమే తప్పా సౌకర్యాలను విస్మరించారు. దీంతో



కలుగోట్లలో క్రీడా ప్రాంగణం బోర్డును పక్కకు పెట్టిన అధికారులు

క్రీడా ప్రాంగణాలు కేవలం బోర్డులకే పరిమితమయ్యాయి. చాలావరకు గ్రామాలకు దూరంగా ఉండడంతో పాటుగా క్రీడా పరికరాలు సరిగ్గా లేకపోవడంతో క్రీడలు ఆడటానికి వీలు లేకుండా పోయింది. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సుమారు రూ.70 వేల నుంచి రూ.2 లక్షల వరకు వెచ్చించి ప్రతి గ్రామ పంచాయతీలో క్రీడా ప్రాంగణాలు నిర్మించి రెండేళ్లు దాటుతున్నా అధిక శాతం వినియోగంలో లేవు. కలుగోట్ల, భైరాపురం, మెన్నిపాడు, ఇటిక్యాలపాడు, బొంకూరు గ్రామాల్లో బోర్డులకే పరిమితమయ్యాయి.

అన్ని చోట్ల నిరుపయోగం

మండలంలో ప్రభుత్వ స్థలాలు, పాఠశాలలు, ఖాళీ స్థలాలు, పల్లె ప్రకృతి వనాల్లో క్రీడా ప్రాంగణాల బోర్డులు ఏర్పాటు చేశారు. కనీసం వాటి పర్యవేక్షణ లేక ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారాయి. దీంతో క్రీడా మైదానాల్లో పిచ్చిమొక్కలు పెరిగి అడవులను తలపిస్తున్నాయి. క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేసినా అవి అటకెక్కాయి. ప్రభుత్వం స్పందించి క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని యువత కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



క్రీడా ప్రాంగణాల నిర్వహణ బాధ్యత పంచాయతీలదే. గ్రామాల్లో ఏర్పాటు చేసిన మైదానాలను వినియోగించుకునేలా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. చాలా వరకు వినియోగంలో ఉన్నాయి. కొన్ని చోట్ల పర్యవేక్షణ కరువైంది. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– తిరుపతన్న, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, ఉండవెల్లి

క్లుప్తంగా

గర్భిణులకు వైద్య పరీక్షలు



మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, గోకులపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు గ్రామాల్లో సోమవారం డాక్టర్ సింధు, యాకుబ్‌బాషా ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి నుంచి రక్తనమూనాలు సేకరించి టీ–హబ్‌కు పంపుతామన్నారు. న్యూట్రిషన్ గురించి రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రన్న, తిరుమల్‌రావు, అక్కమ్మ, చిట్టెమ్మ, సంధ్య ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు



ఎర్రవల్లి: మండలంలోని బీచుపల్లి శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం చేశారు. ఆలయ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఉపాధ్యాయులను కేటాయించండి



రాజోళి: మండలంలోని తుమ్మిళ్ల యూపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో 260 మంది విద్యార్థులు ఉండగా.. ఆరుగురు ఉపాధ్యాయులు ఉండేవారని, బదిలీలపై ముగ్గురు వెళ్లిపోగా ఒక్కరు కూడా రాలేదన్నారు. దీంతో ఎనిమిది తరగతులకు సిబ్బంది సరిపోక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందట్లేదని వాపోయారు. దీనిపై గతంలోనే కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించగా.. డీఎస్సీ ద్వారా కేటాయింపు చేస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో 5 నెలలుగా మౌనంగానే ఉన్నామని తెలిపారు. కానీ ప్రస్తుతం ఒక్కరే ఉపాధ్యాయుడిని కేటాయించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే సగం విద్యా సంవత్సరం గడిచిపోయిందని, ఇప్పటికైనా సిబ్బందిని కేటాయిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. ఈ సమస్యతో పాటు టాయిలెట్లు, ప్రహరీ లేకపోవడం, తాగునీటికి ఇబ్బందిగా ఉన్నప్పటికీ ప్రైవేట్ పాఠశాలలకు పంపలేక, గ్రామంలోనే చదివిస్తున్నామని, కనీసం టీచర్లనైనా కేటాయిస్తే చాలని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు.

విద్యారంగ వ్యతిరేక విధానాలపై పోరాడుదాం



గద్వాల అర్బన్: రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై సంఘటితంగా పోరాడుదామని బీఆర్‌ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ కుర్వ పల్లయ్య పిలుపునిచ్చారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి సోమవారం జిల్లా కేంద్రంలో ఐడీవోసీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగంపై నిర్లక్ష్యం వహిస్తోందని, పది నెలలుగా విద్యార్థులను మోసం చేస్తోందని మండిపడ్డారు. హాస్టల్ విద్యార్థులకు మెస్‌చార్జీలు, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, పెండింగ్‌లోని స్కాలర్‌షిప్స్, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని, గ్రూప్–1 ఉద్యోగాలకు అడ్డంకి మారిన జీవో నెం. 29ని రద్దు చేసి, జీవో నెం.55ప్రకారం ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రేమలత, మాధవ్, ఖాజావలి, సోమశేఖర్, నర్సింహ, వీరేష్, రాజు తదితరులు ఉన్నారు.

శాస్త్రోక్తంగా ఆలయ పునర్నిర్మాణ పూజలు

అయిజ: మండలంలోని వెంకటాపురం స్టేజీ సమీపంలో సవరమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పూజలను వేదపండితులు సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం వేదపండితులు వేదమంత్రాలు జపిస్తూ హోమం చేశారు. పూజా కార్యక్రమాలకు వెంకటాపురం, కిష్టాపురం గ్రామాలతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



సవారమ్మ మూలవిరాట్



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేద్దాం

శాంతినగర్: జడ్చర్లలో ఈనెల 30న జరిగే మాదిగల ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేద్దామని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కొంకల భీమన్న మాదిగ అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగ, మాదిగ ఉపకులాలు 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నారన్నారు. ఈ పోరాటాన్ని గుర్తించిన సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అని, ఉమ్మడి రిజర్వేషన్లలో మాదిగ ఉపకులాలకు సమన్యాయం జరిగేలా వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించినా.. ప్రస్తుతం కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ వర్గీకరణ చేపట్టకుండానే ఉద్యోగ నియామకాలు చేపట్టి మాదిగలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మాదిగలకు రిజర్వేషన్లలో న్యాయం జరిగేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జడ్చర్లలో మాదిగల ధర్మయుద్ధ మహాసభ ఏర్పాటు చేశారన్నారు. సమావేశానికి జిల్లాలోని మాదిగలందరూ హాజరై విజయవంతం చేయాలని భీమన్న కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మస్తాన్‌మాదిగ, ఎంపీఎస్ జిల్లా కన్వీనర్ రాజుమాదిగ, నాయకులు ఏసేపు, రాజశేఖర్, దేవరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొంకల భీమన్న మాదిగ

వివాదాస్పదంగా భూమి రిజిస్ట్రేషన్

గట్టు: మండలంలోని పెంచికల్‌పాడు గ్రామానికి చెందిన 75 ఏళ్ల మాల తిమ్మక్క భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయడం వివాదస్పదంగా మారింది. ఈ మేరకు తమకు తెలియకుండానే ఇతరులకు భూమి రిజిస్ట్రేషన్ చేశారని మాల తిమ్మక్కతో పాటు కుటుంబ సభ్యులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా.. పెంచికల్‌పాడుకు చెందిన మాల తిమ్మక్క పేరు మీద గ్రామ శివారులో సర్వే నెంబర్ 282బై1, 283ఇ111 లో మొత్తం 2ఎకరాల 29 గుంటల పొలం ఉంది. తిమ్మక్కకు ఇద్దరు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు ఉండగా.. వారందరూ మరణించడంతో కోడళ్లు, మనుమరాలు ఉన్నారు. అయితే అదే గ్రామానికి చెందిన సమీప బంధువు నాగరాజు మాల తిమ్మక్కకు మాయ మాటలు చెప్పి తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లి దళారుల సహాయంతో సొంత కుటుంబ సభ్యులకు తెలియకుండానే మునెమ్మ పేరు మీద భూమి రిజిస్టర్ చేసినట్లు తిమ్మక్క మనుమరాలు ఆరోపించారు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేయడంతో పాటు విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. తిమ్మక్కకు చెందిన పొలాన్ని నిబంధనల మేరకు ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసినట్లు తహసీల్దార్ సరితరాణి తెలిపారు. భూమి రిజిస్ట్రేషన్‌కు ముందు ఎవరు కొంటున్నారనే విషయాలు తెలుసుకున్న తర్వాతే రిజిస్టర్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.



తహసీల్దార్ కార్యాలయంలో భూమి రిజిస్ట్రేషన్‌పై ఆరా తీసిన వృద్ధురాలు

ఇసుక లారీలపై కేసు నమోదు

గద్వాల క్రైం: సామర్థ్యానికి మించి ఇసుకను తరలిస్తున్న రెండు లారీలు, ఒక టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఇసుక వ్యాపారులు కొత్తగూడెం భద్రాద్రి జిల్లా క్యాతిగూడెం గ్రామం నుంచి టిప్పర్, ములుగు జిల్లా నుంచి రెండు లారీల్లో సామర్థ్యానికి మించి ఇసుకను గద్వాలకు తరలిస్తున్నారు. పోలీసులు సోమవారం తెల్లవారుజామున గద్వాల, అయిజ రోడ్డు మార్గంలో తనిఖీలు చేయగా.. మూడు వాహనాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు ఉండాల్సిన ఇసుక కంటే ఎక్కువగా ఉండడంతో వాహనాల యాజమానులు మహేందర్‌గౌడ్ (జడ్చర్ల రాజాపూర్, ప్రస్తుత నివాసం గద్వాల), రాంజీనాయక్ (నారాయణపేట), శంకర్‌నాయక్ (మహబూబ్‌నగర్), ముగ్గురు డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు టిప్పర్‌లో 26 టన్నులకు గాను 39 టన్నులు, రెండు లారీలో 32 టన్నులకు గాను 49 టన్నుల ఇసుక ఉండడం గుర్తించమన్నారు. సామర్థ్యానికి మించి ఇసుకను ఎక్కడి నుంచి వాహనాల్లో లోడ్ చేసుకున్నారు.. ఇసుక రీచ్‌ల నుంచి అధికారులకు తెలియకుండా ఇసుకను లోడ్ చేశారనే కోణంలో విచారణ చేస్తున్నామన్నారు.



పట్టుబడిన ఇసుక వాహనాలు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని రాంపురం గ్రామ శివారులోని ఊకచెట్టు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు మండలం రాంపురం గ్రామానికి చెందిన డ్రైవరు అరుణ్ ఊకచెట్టు వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా బీట్ విధులు నిర్వహిస్తున్న పోలీసులు గ్రామంలోని ఆలయం వద్ద ఆపి విచారించారు. దీంతో ఎలాంటి అనుమతి పత్రాలు చూపకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీలు వాయిదా

అయిజ: మండల స్థాయిలో ఈనెల 29 మంగళవారం నుంచి నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా పోటీలను వాయిదా వేసినట్లు ఎంపీడీఓ వెంకటయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హౌస్ హోల్డ్ సర్వే, ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాలు ఉండడంతో మండల స్థాయి క్రీడా పోటీలను వాయిదా వేసినట్లు తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

పాఠశాలల సందర్శన



కేటీదొడ్డి: మండలంలోని ఇర్కిచేడు, ఇర్కిచేడుతండా, ఆయా గ్రామాల్లో పాఠశాలలను సోమవారం ఎంఈఓ వేంకటేశ్వర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం, పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్‌ఏ పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

ఎర్రవల్లి: ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన ఘటన సోమవారం మండలంలోని కొండేరులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కొండేరుకు చెందిన వడ్డె పరశు, బుడ్డన్న ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి షేకుపల్లికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎర్రవల్లి రైస్‌మిల్లు సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు కిందపడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఇద్దరిని ప్రైవేట్ వాహనంలో గద్వాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కారును ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై ఇటిక్యాలపాడు శివారులోని ఘర్ డాబా సమీపంలో కారును గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు వెళ్తున్న కారును గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో.. కారులో ఉన్న చంద్రశేఖర్, సువర్ణ, జయంతికుమార్‌కు స్వల్ప గాయాలవడంతో హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

క్యాన్సర్‌తో పోరాడుతూ చిన్నారి మృతి



ఉండవెల్లి: మండల కేంద్రంలోని రాఘవేంద్ర చారి, మౌనిక దంపతుల కుమార్తె గాయత్రి (12) క్యాన్సర్ వ్యాధితో పోరాడుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రెండేళ్లుగా చిన్నారి గాయత్రీ క్యాన్సర్‌తో బాధపడుతుండగా తిరగని ఆస్పత్రి లేదని తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. దాదాపు రూ.5 లక్షలకు పైగా ఖర్చు చేసినా తమ బిడ్డ దక్కలేదని కన్నీటిపర్యంతం అయ్యారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని వినతి

ధరూరు: రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని తపస్ మండల అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ అలివేలుమంగమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు రావాల్సిన 4 పీఆర్సీలు, ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్(టీపీయూఎస్) నాయకులు లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు, మోహన్, హరివంశీ, రాజేష్, సురేష్, చక్రవర్తి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మంజులకు తమ సమస్యలను పరిష్కరించాలని తపస్ సంఘం యూనియన్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ–కుబేర్‌లో పెండింగ్ బిల్లులు, నాలుగు డీఏలను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. నవంబర్ 22 నాటికి సమస్యలు పరిష్కరించకపోతే 23న హైదరాబాద్‌లో ధర్మగ్రహ దీక్ష చేపడతామన్నారు. కార్యక్రమంలో తపస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మధు, వసంత్, మండల అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్, చంద్రశేఖర్, కరుణాకరన్, నరేంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయలంలో తహసీల్దార్‌కు మండల అధ్యక్షుడు రాఘవ ఆధ్వర్యంలోని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, కృష్ణ, రత్నాకర్, గోపాల్, రాంబాబు, తదితరులు ఉన్నారు.

గట్టు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ధర్మగ్రహ దీక్ష నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం తహసీల్దార్‌కు తపస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు పరశురాం, రాజు, సభ్యులు శ్రీను తదితరులు ఉన్నారు.



ధరూరులో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న తపస్ నాయకులు



కేటీదొడ్డి తహసీల్దార్‌కు..

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

ఆత్మకూర్: అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలన్నీ వంద రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 300 రోజులు అవుతున్నా కాలయాపన చేస్తోందని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న అన్నారు. సోమవారం స్థానిక రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, పంటల, రైతు బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధరణి సమస్యలు పరిష్కరించడంతో పాటు అర్హులకు పోడు పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, ప్రసాద్, చెన్నరాయుడు, రాందాసు, మణివర్ధన్, ఆశన్న, కుర్మన్న, చింతలన్న, సామేలు, రైతులు ఉన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రగతిశీల రైతుసంఘం నాయకులు

మున్సిపాలిటీ ఎదుట సీపీఐ ధర్నా

అమరచింత: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ మున్సిపల్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు అబ్రహం, భాస్కర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 1, 2, 4, 6, 7 వార్డుల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ ఏర్పడి నాలుగేళ్లు గడుస్తున్నా.. ఎక్కడి సమస్యలు అక్కడనే అన్నట్టుగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త డంపింగ్ యార్డును తరలించాలని, 3, 4, 7వ వార్డుల్లో మిగిలిపోయిన సీసీ రోడ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలన్నారు. 4వ వార్డులో మహిళలకు మరుగుదొడ్లను నిర్మించాలని తహసీల్దార్ కార్యాలయం నుంచి కుమ్మరిగేరి వరకు నిరుపయోగంగా ఉన్న కాల్వ మరమ్మతులు చేసి డ్రెయినేజీ నిర్మించాలన్నారు. పట్టణంలో ప్రమాదకరంగా మారిన 11 కేవీ విద్యుత్ వైర్లను తొలగించి కొత్త లైన్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాత విద్యుత్ ఇనుప స్తంభాలను తొలగించి ప్రమాదాలు నివారించాలంటూ మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రవీందర్, శ్యాంసుందర్, లక్ష్మీనారాయణ, సౌలు, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

రిజర్వాయర్‌లో చేప పిల్లల విడుదల

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్‌లో సోమవారం మత్స్యశాఖ అధికారులు 80 వేల చేప పిల్లలను వదిలారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన చేపల రకాలు బొచ్చ, రవ్‌ట, మైనూ వంటి 8 నుంచి 10 సెంటిమీటర్ల సైజులో ఉన్న చేప పిల్లలను రిజర్వాయర్‌లో వదిలినట్లు ఫీల్డ్ ఆఫీసర్ భరత్, ఫీల్డ్ మెన్ వీరేష్ తెలిపారు. రిజర్వాయర్‌తోపాటు ఊరచెరువులో 30 వేలు, మాదిరెడ్డికుంటలో 10,500 చేపపిల్లలను వదిలామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారి సతీష్, మత్స్యశాఖ సిబ్బంది రవి, రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్యయాదవ్, నాయకులు రవీందర్‌రెడ్డి, వెంకటయ్య, సురేష్, ఇరిగేషన్ అధికారి అనంతప్రసన్నరాణి తదితరులు పాల్గొన్నారు.



గోపల్‌దిన్నె రిజర్వాయర్‌లో చేప పిల్లలు వదులుతున్న అధికారులు, కాంగ్రెస్ నాయకులు

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఆత్మకూర్: రాష్ట్రప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.7,500 కోట్ల బోధన ఫీజులు, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అర్జున్, రాష్ట్ర నాయకుడు సాయికుమార్ అన్నారు. సోమవారం విద్యార్థులతో కలిసి ఆత్మకూర్ పురవీధుల గుండా భారీ ర్యాలీ చేపట్టి స్థానిక గాంధీచౌక్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడుస్తున్నా.. నేటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. బోధన ఫీజులు చెల్లించకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులను వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. రాస్తారోకో కారణంగా భారీగా ట్రాఫిక్ జాం కావడంతో పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రాజేష్, సందీప్, అనిల్, మణి, నిజగుణ, విద్యార్థులు తదీతరులున్నారు.

వర్షపు నీరు ఆదా చేయండి

ఆత్మకూర్: వర్షపు నీరు వృథా కాకుండా.. ఒడిసి పట్టుకొని భూగర్భ జలాలను పెంపొందించాలని పాలమూరు యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ యుగంధర్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 2 ఆధ్వర్యంలో మానవ జీవనం, భూగర్భ జలాల పాత్ర అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భూగర్భ జలాలు పెరిగితేనే మానవ మనుగడ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్, వైస్‌ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు షకీల్‌అహ్మద్, చక్రపాణిరెడ్డి, శ్రీనివాసులు, లత, గిరిధర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.